పొగ మంచు

మంచుకురుస్తోంది. కిటికీ అద్దాలపై మంచు పేలిపోయింది. బయటి వాతావరణము ఏమాత్రమూ కనిపించటం లేదు. దూరంగా ఫిరంగుల మ్రోత విన వస్తోంది. ఆకాశంలో ఫట్! ఫట్!! మంటూన్న ధ్వనులూ వినిపిస్తోన్నాయి. పేషెంటుల తలలప్రక్కనున్న ఎలక్ట్రిక్ హీటర్సు ద్వారా వార్డ్‌లోని వాతావరణం వెచ్చబడుతోంది.

సిగరెట్ వెలిగించి వార్డ్ యివతలి కొచ్చాడు నర్సింగ్ అసిస్టెంట్ రాజు. దూరంగా హిమాలయాలపై ఓ ప్రక్క సన్నని నీరెండ ఆవహించిఉంది. మరో ప్రక్క దట్టమైన పొగమంచు పేరుకుని పోయి ఉంది. మంచు ముసుగు వేసుకున్న హిమాలయాలు నీరెండలో ధవళకాంతు లీను తున్నాయి. పొగమంచులోని సన్నని చీకటి దూరంగా ప్రేలుతున్న ఫిరంగుల మంటలు మధ్య మధ్యన చీలుస్తున్నాయి. ఆకాశంలో బాణాసంచా ప్రేలినట్టు జ్వాలలు చెలరేగు తున్నాయి.

రాజు ముఖం జేవురించింది.

ఈ యుద్ధం ఏ పరమార్థాన్నాశించి జరుగుతోంది? పొరుగు దేశాన్ని కబళించా లన్నది ఎదుటి వాడి నిర్ణయం. రక్షించు కోవాలన్న తాపత్రయం యివతలి వాడిది. ఒకణ్ణొకడు చంపుకొని సాధించే గెలుపు యొక్క ఫలితం ఎవరికి దక్కుతోంది? మంచుకొండల్లో మరఫిరంగుల సాన్నిహిత్యంలో రంపపుకోత ననుభవిస్తోన్న

యస్. పురుషోత్తమాచారి

సైనికుడికా? లేక మెత్తని పరుపుల దొంతరలలో మెలికలు తిరుగుతూ అదేశాలిచ్చే రాజకీయనాయకులకా? ఏవిటీ జీవితం? విజయం సాధించాలన్న ఆకాంక్ష, సాధించానన్న తృప్తిలో ఈ సామాన్య సైనికుడి రుధిరం వేగాన్ని పుంజుకుంటుందెందువల్ల?

"రాజూ!" అన్నపిలుపు ఆ లోచల్నుంచి అతన్ని వాస్తవ జగత్తులో పడవేసింది.

మంచుకన్నా తెల్లనిదుస్తుల్లో నర్స్ మేరీ వార్డ్ చివరినుంచి పిలిచింది. నడిచాడతను.

"చలిలో ఏవిటా ఆలోచన రాజూ! బెడ్ నంబర్ సిక్స్ పేషంట్ మంచంలోంచి జారిపడ్డాడు. అసలే ఫ్రాక్చరయిన కాళ్లు!"

వెన్నున చరిచినట్టయింది రాజుకు. తూనీగలా పరిగెత్తాడు వార్డ్‌లోకి. అప్పటికే లేచి నడవగలిగిన పేషెంట్సు కొందరు బెడ్ నెంబరు సిక్స్ పేషెంటును లేవనెత్తి మంచంలో పడుకోబెట్టారు. కాని వారతన్ని కంట్రోల్ చేయలేకపోయారు. మంచంలోంచి ఉరకటానికి ప్రయత్నిస్తున్నాడావ్యక్తి.

"ఆ లాంగ్ రేంజ్ గన్ నేను లేందేపని చేయదు. ఆ సెక్టరును కాపాడాలి. నన్ను వెళ్ళనీయండి ప్లీజ్?" అరుస్తూ నానా గొడవ పెడుతున్నాడతను.

రాజు నిర్ఘాంతపోయాడు.

రెండుకాళ్లూ పోయిన ఈ వ్యక్తికేమిటీ దేశాభిమానం? ఏ శక్తి అతన్నిలా కదిలిస్తోంది? తప్తనయనాలతో మార్ఫియా యిచ్చాడు రాజు.

ఘూనఘోంతరాళాలు దద్దరిల్లేంతటిధ్వని వినవచ్చింది పొగమంచున్న దిసనుంచి. ఫిరంగులమ్రోత ఆగిపోయింది. ఆకాశంలో నిశ్శబ్దం ఆవరించింది. అంటే ఆ ప్రక్కన బాంబుపడి ఆ ప్రాంతమంతా భస్మీపటలమయిందన్నమాట. గాఢంగా నిట్టూర్చాడతను.

"అయిపోయింది! సర్వనాశనమయిపోయింది! తూర్పు దిసంతా స్మశానమయిపోయింది!" ప్రక్కవార్డ్‌లోని పేషెంటెవరో అరుస్తున్నాడు. కిటికీ తెరిచి చూచాడు రాజు. తెరచిఉన్న అవతలివార్డ్ తలుపుల్లోంచి కనిపించిన దృశ్యంచూచి తల ప్రక్కకు తిప్పుకొన్నాడతను. ఆపేషెంట్ తలనిండా తెల్లని ముసుగు కప్పుతోంది నర్స్‌మేరీ!

అరగంట గడిచింది.

ఆకాశంలో బరబర ధ్వని వినవచ్చింది. పెద్దరాబందుల్లా రెండు హెలికాప్టర్‌లు ఆస్పత్రివైపు దూసుకొస్తున్నాయి. గుండెలరచేతుల్లో ఉంచుకొని ఆవంకే చూడసాగారంతానూ. దాపులోకొస్తోన్నవానిపై స్వదేశ చిహ్నాలుచూచి తృప్తిగాశ్వాసవదిలారంతానూ. మరుక్షణంలోనే అవి



హాస్పటల్ హెలీపాడ్‌లో వ్రాలాయి. హాస్పటల్ స్టాఫంతా కంగారుగా పరుగులు తీస్తున్నారు. కొందరు వీల్‌ఛైర్స్‌ను త్రోసికెడుతున్నారు. కొందరు స్ట్రెచర్‌లను మోసుకెడుతున్నారు.

హెలికాప్టర్లనుంచి ఎనిమిది క్షత గాత్రుల స్పృహకోల్పోయిన దేహాలు దించబడ్డాయి. ఆపరేషన్ థియేటర్‌లో హడావిడి. వార్డ్‌నంబర్ ఫోర్ చివర ఉన్న స్టోర్స్‌వైపు పరుగెత్తుకొచ్చారు కొందరు డాక్టర్లు. రాజు వెళ్ళి స్టోర్ తెరిచాడు. చేతికందినన్ని డెక్స్ట్రోస్ బాటిల్స్‌తో వచ్చినంత వేగంగా పరిగెత్తారంతానూ.

ఆ హెలికాప్టర్లో క్రొత్త వార్తను తీసుకొచ్చాయి. తూర్పుదిసన శత్రుస్థావరాలపై మనవాళ్లే బాంబులువేసినట్టూనూ, అవతలి ప్రక్కన అంతా చల్లబడిపోయినట్టూనూ.

పేషెంట్లంతా ఆ వార్తవిని విజయోత్సాహంతో కేరింతలు కొడుతున్నారు. ప్లేట్లను స్పూన్లతో వాయిస్తూ ఎవరి భాషలో వారు విజయ గీతాలు పాడుకుంటున్నారు.

ఒకడి మరణంతో మరొకడు పొందే మహాదానందం!

తూర్పు ప్రాంతం ప్రశాంతంగా ఉంది కాబట్టి సైనికులను త్వరిత గతిని ట్రీట్ చేసి పంపనవసరం లేదనీ వారిని విశ్రాంతి తీసుకోనిమ్మనీ వచ్చిన ఆర్డర్స్ ననుసరించి వార్డ్ డాక్టర్స్ కొచ్చిన మెమో కాగితాన్ని చూస్తుండగానే ఎమర్జెన్సీ నైట్స్‌లో వారం రోజుల్నుంచీ నిద్రెరగని రాజుకు

నిద్రమత్తు ముంచుకువచ్చింది. కను రెప్పలు భారంగా మూతవడసాగాయి. మెల్లిగావెళ్ళి డాక్టర్ టేబుల్‌పై ఉంచాడా కాగితాన్ని.

''రాజూ! ఈ బెడ్ సవరించు!'' కేప్టెన్ ఆదేశం గంభీరంగా వినిపించింది వార్డులో. తృళ్ళిపడి పరిగెత్తాడు. సవరించిన బెడ్‌లో అంతకుముందే హెలికాప్టర్‌లో వచ్చిన ఓ పేషెంటుని పడుకోబెట్టి వెళ్ళిపోయారు స్టాఫ్ నర్సులు.

ఆవ్యక్తివంక చూచాడు రాజు.

ఏభై ఏళ్ళుండవచ్చు. తలంతా బాండేజితో కప్పబడిఉంది. కేస్‌షీటు తీసి చూచాడు. తలంతా ప్రాక్చరయింది. కిడ్నీలు నలిగిపోయాయి. అతనికి దాపులోని హీటర్ అన్‌చేసి తనటేబుల్‌వైపు వెళ్ళాడు రాజు.

లంచ్ హవర్‌లో వార్డులోని పేషెంట్లంతా భోంచేస్తున్నారు. క్రొత్తగా వచ్చిన ఆ పేషెంటుకు స్పృహ వచ్చినట్టుంది. ప్రక్కబెడ్‌లోని వ్యక్తితో మెల్లిగా ఏదో మాట్లాడుతున్నాడు.

నర్స్‌మేరీ వార్డులోకి వచ్చింది.



"సిస్టర్!" పిలిచాడావ్యక్తి మంద స్వరంతో.

మేరీ అతనివైపు వెళ్ళింది.

అతనేదో చెప్పాడామెకు.

"రాజూ!" మేరీ పిలిచింది.

"ఇతను తెలుగువాడు. తెలుగువారెవరన్నా ఉన్నారేమోనని అడుగు తున్నారు. అతని సంగతేవిటో చూడు." అంటూ వెళ్ళిపోయింది. వెళ్ళి అతని ప్రక్కనే ఉన్న టీపాయ్‌పై చతికిల బడ్డాడు రాజు.

"రాజు అంటారండి నన్ను!"

"నేను సూబేదార్ జానకిరాంను! చిర్నవ్వు తెచ్చుకోడానికి చాలా బాధపడ్డాడతను.

"మీదేవూరు బాబూ!"

"గూడెం దగ్గరి మాధవరమండి!"

"సంతోషం బాబూ! మాది ఏలూరు!"

"పిలిచారట!" అన్నాడు రాజు.

ఓ క్షణం కళ్ళుమూసుకున్నాడు జానకిరాం. బాధ అతన్ని మెలికలు త్రిప్పటం ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది.

"అవును బాబూ! నాయీ స్థితిలో ఓ తెలుగువాడి పరామర్శ అవసరమని పిలిచాను. ఓ ఉత్తరం వ్రాసిపెట్టే తీరికుందా బాబూ నీకు?"

"అలాగే నండీ! తప్పకుండా వ్రాసి పెడతాను. ఏం రాయాలో మొదట చెప్పండి. తర్వాత నేను వివరంగా వ్రాస్తాను."

"అలాగే బాబూ! ఏవిటో విధి వైచిత్రం? యుద్ధం రాకపోతే వారం రోజుల క్రితం యింట్లోఉండేవాడిని. డిశ్చార్జి

వచ్చింది. యిరవైయ్యేడేళ్ళ సర్వీసులో ఉత్తరం మరోహరి చేత వ్రాయించుకునే అవసరం రాలేదు. ఈ రోజు వచ్చింది. బహుశః జీవితంలో యిదే చివరి ఉత్తరం కావచ్చు.''

''అలాంటి నిరుత్సాహాన్ని పెంచుకోకండిసార్! యిక చెప్పండి!'' అన్నాడు రాజు.

''చెబుతాను నాయనా! చెపుతాను. మనసులో ఉన్న బాధ ఒకరికి చెప్పుకున్నపుడే శాంతి.

''మగనలుసుకై ఎదురు తెన్నుల్లో ఎదురు దెబ్బలుతిన్నాను. ఆరుగురాడపిల్లన్ని కని ఆలనా పాలనా చూడలేకపోయాను. పిల్లలు తల్లిలేనివాళ్లు కావటం, నేను దూరాన ఉంటం, వారి బాగోగులు చూచేవాళ్ళులేక చెడుదారుల పాలయ్యారు. యింతవరకు కాణీ మిగల్చకుండా పెద్దమ్మాయిపేర డబ్బుపంపుతూ వచ్చాను. అంతా చదువుతున్నారనుకో. వింటున్నావా బాబూ?'' ప్రశ్నార్థకంగా రాజువంక చూచాడాయన.

''వింటున్నానండి!'' అన్నాడు రాజు లేనిఓపికను కొనితెచ్చుకుంటూ!.

''నాలాంటి పేషెంట్లను ఎందరినో చూసి ఉంటావు. అంతా యిలాగే మిమ్మల్ని విసిగిస్తుంటారనుకుంటాను. కాని నా విషయంలో కొంచెం ఓపిక తెచ్చుకో బాబూ! నాకెందుకో నా జీవితానికి చరమదశ దాపులోకొచ్చిందనిపిస్తోంది. ఏక్షణంలో కన్నుమూతపడేది తెలియదు. నా విషయం తెలిసిన వారెవరైనా ఉంటే నా తర్వాత నా బిడ్డలకేమైనా ఉపయోగ పడగలుగు తారనే నా తాపత్రయం బాబూ!''

''ఈ స్థితిలో యిలాంటి ఆలోచనలు కూడవు సూబేదార్‌గారూ! నావల్లఅయ్యే సహాయం అంటూఉంటే మీకు తప్పక తోడ్పడతాను. యిక చెప్పండి.''

''ఎదిగిన ఆడపిల్లల్ని ఎవరి పంచన ఉంచను బాబూ! ఏదోబంధువులనదగ్గ వారి సహాయంతో యింతకాలం నెట్టుకొచ్చాను. కాని ఈ మధ్యనే మావూరినుంచి ఓస్నేహితుడు వ్రాసిన ఉత్తరం నాగుండెల్ని చీల్చింది. మారెండో అమ్మాయి గతనెల్లాళ్లుగా కనిపించటం లేదట. దాన్ని గురించి అంతా చెడుగా చెప్పుకుంటున్నారని తెలిస్తే ఏ తండ్రి గుండెలు బద్దలవవు బాబూ? నా కుటుంబం రచ్చకెక్కి, అవమానాల పాలవటం ఎలాసహించను? రిలీజు కప్లై చేసాను. అర్డర్లు వచ్చాయి. మూటముల్లే సర్దుకుని బయలుదేరు దామనుకునే సరికి యుద్ధం వచ్చింది. అర్డర్సు కాన్సల్ చేశారు. ఫ్రంట్‌కెళ్ళాలిసి వచ్చింది. దాని ఫలితంగా యిలా ఈ మంచంపై విశ్రాంతి అవసరమయింది.

''బాంబు పేలుడుకు నా తల చిట్లిపోయింది. నేనుయిలా మాట్లాడగలుతున్నాను. కాని యిక బ్రతకను బాబూ!

కాని ప్రాణం పోకముందు నేను చేయాల్సిన పని కేవలం ఈ ఉత్తరం వ్రాయడమే. దాని ద్వారానే నా పిల్లలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సి ఉంటుంది. నా కథంతా చెప్పి నీకు విసుగు కలిగించాను బాబూ! ఆ! కాస్త కాగితం కలం తీసుకు రాగలిగితే నేను చెబుతుంటాను, వ్రాద్దువు గాని,'' అంటూ సాభిప్రాయంగా రాజు వంక చూచాడు సూబేదార్ జానకిరాం.

''అలాగేనండి!'' అంటూలేచి తన టేబుల్ దగ్గరికి వెళ్ళ బోయాడురాజు. యింతలోనే బెడ్ నంబర్ సిక్స్ పేషెంటు పెద్ద గొడవచేస్తూ మంచంలోంచి ముందుకుతూలాడు. క్రిందపడి గిలగిల్లాడుతున్న అతని ఫ్రాక్చరయిన కాలిఎముక స్థానభ్రంశం పొందింది.

గుండెగుభేల్ మంది రాజుకు. జానకిరాం కథవింటూ తను యితర పేషెంట్లు గొడవ మరచిపోయాడు. తన్ను తాను నిందించుకొంటూ డి. ఎమ్. వో. కు ఫోన్ చేశాడు. డాక్టర్ వచ్చి అతని కాలిని సవరించే సరికి సాయంకాలం ఆరయింది.

రాజు రిలీవర్ బల్‌బీర్‌సింగ్ వచ్చాడు.

సింగును చూడగానే రాజుకు అలసట ముంచుకువచ్చింది. వారం రోజులుగా నిద్రనోచుకోని కళ్లుమూతలుపడసాగాయి. గబగబా డ్యూటీ హాండోవర్ చేశాడు రాజు. వెంటనే వెళ్ళి తనరూంలో మంచంపై వాలిపోవాలనుందతనికి. గడప వైపు అడుగువేయ బోయిన అతనికాళ్ళకు జానకిరాం పిలుపు బంధంవేసింది.

జానకిరాం కథవింటూ తను యితర పేషెంట్ల గొడవ మరచిపోవటమూ, బెడ్. నంబర్ సిక్స్ విషయంలో తనుచేసినపొరపాటు, ఆపై డాక్టరు ద్వారా తిన్న చీవాట్లూ గుర్తుకొచ్చి అతనిపై అకారణ విసుగు జనించింది రాజుకు. కాని జానకిరాం కా విషయం తెలిసి రానివ్వలేదు.

''జానకిరాం గారూ! ఉత్తరం ఉదయం వ్రాసిపెట్టగలనండి. ప్రస్తుతంవీలుకాదు.'' అంటూనే అతని పల్సూ, టెంపరేచరూ చూచాడు. పల్సు తృప్తికరంగానే ఉన్నప్పటికీ కొంచెం టెంపరేచరుంది. మందుల ప్రభావం ఉదయానికి జ్వరాన్ని తగ్గింపవచ్చు. అదీకాక పోస్టు మర్నాడు పదింటికి గాని వెళ్ళదు. ఈ లోపల విశ్రాంతి చాలా అవసరమనిపించింది రాజుకు. ఈ వేళ ప్రశాంతగా ఉంది. రేపుమళ్ళీ శత్రువు లటాక్ చేస్తే యిహ కాజువాలిటీస్‌తో విశ్రాంతి ఉండదు. అదే ఉద్దేశ్యంతో అన్నాడురాజు.

కాని జానకిరాం కళ్ళలోనీళ్లు సుళ్లు తిరిగాయి.

''బాబూ! ఈ రాత్రి గడిచే నమ్మకం మాత్రం నాకులేదు. నేను కన్నుమూయక ముందే ఈ ఉత్తరం వ్రాయాలి. ఈ చిన్న సహాయం నా తుదికోరికగా చేసి పెట్టు నాయనా!''

''జానకిరాం గారూ! ఎందుకలా నిరాశపడతారు. వారం రోజుల్నుంచి నాకు నిద్రలేదు. ఖాళీగా ఉన్న క్షణం కళ్లమూతలు పడతున్నాయి. నన్ను నమ్మండి సార్! రేపు రాగానే మీ ఉత్తరం వ్రాసేకనే మరో పని చూచుకుంటాను.'' అంటూన్న రాజు కళ్ళముందు మసగకమ్ముకొస్తోంది. నిద్రావస్థలోనే ముందుకు తూలాడతను.

తప్త నయనాలతో రాజు అవస్థను గమనించాడు జానకిరాం, అతని హృదయం జాలితో నిండిపోయింది.

''సరే వెళ్లు బాబూ! ఉదయమే చూతాం!'' అన్నాడు గాద్గదికంగా.

రాజు కళ్లు తెరిచాడు.

''సుబేదార్ గారూ! మీరు ప్రతి నిమిషమూ జీవితంపై ఆశను సన్నగిల చేసుకొంటున్నారు. బ్రతుకుపై ఆశను చంపుకోవటం ఎంతో అవివేకం. మీరు తప్పక కోలుకుంటారు. ధైర్యంగా ఉండండి. వస్తాను.'' వెడుతూనే జానకిరాం వంక చూచాడు రాజు.

జానకిరాం కళ్ళనుంచి రెండశ్రుకణాలతని చుబుకాలపై జారాయి.

* *

ఉదయం వస్తూనే జానకిరాం బెడ్ రోల్ చేసి ఉండటం గమనించి విస్తుపోయాడు రాజు.

''సింగ్! ఆ పేషంటునే వార్డుకు మార్చారు?'' కంగారుగా అడిగాడు.

''కోల్డు రూంకు!'' సింగ్ నిర్వికారంగా జవాబిచ్చాడు. గుండెల్లో గునపం దిగవేసినట్టయింది రాజుకు.

''పూర్ ఫెలో! రాత్రి సడన్‌గా తలలోంచి బ్లీడింగ్ మొదలయింది. ఎంత ప్రయత్నించినా ఆపలేకపోయాము. బిఫోర్ డెత్ అతనేదో ఉత్తరం వ్రాయాలని గొణిగేడు. కాని ఎవరమూ ఆ విషయం పట్టించుకోలేకపోయాం.'' అంటూన్న సింగ్‌ను తప్పించుకు పిచ్చివాడిలా పరిగెత్తాడు రాజు. బయట మసకతో ఫాగ్ దట్టంగా వుంది. ముఖంపైన సన్నని మంచుతెరలు గీతలు వేస్తున్నాయి. రాజు గుండెల్లో పొగమంచు పేరుకుపోయినట్టయింది.